కాలుష్య కోరల్లో వెంకన్నపాళెం

మండలంలో తీరప్రాంత గ్రామమైన వెంకన్నపాళెం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఈ పంచాయతీలోని శరత్ ఇండస్ట్రీస్‌తో పాటు గ్రామం చుట్టూ వెలిసిన హేచరీలతో అటు వాయి కాలుష్యం ఇటు జల కాలుష్యం వెరసి స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రధానంగా గ్రామ నడిబొడ్డున ఉన్న శరత్ ఫీడ్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న తీవ్ర దుర్వాసనతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు.

- శరత్ ఫీడ్ ప్లాంట్, హేచరీలే కారణం
- ఆందోళనలో గ్రామస్తులు

తోటపల్లిగూడూరు : మండలంలోని వెంకన్నపాళెం పంచాయతీలో సుమారు వెయ్యి నివాసాలు ఉన్నాయి. పంచాయతీ నడిబొడ్డున శరత్ ఇండస్ట్రీస్‌కు సంబంధించిన ఫీడ్ ప్లాంట్ ఉంది. దీని నుంచి రొయ్యల ఫీడ్ ఉత్పత్తులను తయారు చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ కంపెనీలో వ్యర్థ అవశేషాలతో పాటు రసాయనిక పదార్థాలను వినియోగించి ఫీడ్(రొయ్యల మేత)ను తయారు చేస్తారు. ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభమైందంటే విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాకుండా రసాయనాలు వెలువడి చుట్టూ జన నివాసాలను కమ్మేస్తోంది. ఈ కంపెనీ కార్య కలాపాలతో తమ జీవన మనుగడ కష్ట సాధ్యమంటూ స్థానికులు పలు దఫాలు ధర్నాలు చేసినా కంపెనీ యాజమాన్యం గానీ, ప్రభుత్వ అధికారులు గానీ స్పందించడం లేదు. కంపెనీ నుంచి వెలువడే ప్రమాదకర రసాయనాల మూలంగా పలువురు అనేక రోగాలకు గురై మృత్యువాత పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఈ శరత్ ఫీడ్ ప్లాంట్‌ను ఎత్తి వేస్తేనే తమ జీవనం సజావుగా సాగుతుందని వారు పేర్కొంటున్నారు.


వెంకన్నపాళెంలో ఉన్న శరత్ ఫీడ్ ప్లాంట్

లేనిపక్షంలో తమను వేరే ప్రాంతానికి తరలించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

హేచరీలతోనూ ఇబ్బందులే

వెంకన్నపాళెం పంచాయతీ సముద్రతీరానికి అతి సమీపంలో ఉండడంతో రొయ్యలు, చేపపిల్లల తయారీ కేంద్రాలు(హేచరీలు) ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. పంచాయతీలో ప్రస్తుతం దాదాపు పది హేచరీల్లో ఉత్పత్తి కార్యకలాపాలు సాగుతోంది. ఈ ఉత్పత్తుల తయారీకి వివిధ రసాయనాలను వాడుతారు. అంతటితో ఆగకుండా అందులో వచ్చే వ్యర్థ జలాలను బయట ప్రాంతాలకు వదులుతుంటారు. ఈ నేపథ్యంలో


దుర్వాసన వెదజల్లే ప్లాంట్ గొట్టం

స్థానికంగా ఉన్న కాలువ, చెరువులు మొత్తం వ్యర్థ జలాలతో నిండిపోతున్నాయి. దీంతో తాగు నీరు కలుషితమై స్థానికులకు అనేక ఇబ్బందులను కలిగిస్తోంది.

రక్షణ కల్పించాలి



వెంకన్నపాళెంలో విచ్చలవిడిగా రొయ్యల హేచరీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వీటి మూలంగా గ్రామంలోని తాగునీటి వనరులు కాలుష్యమైపోతున్నాయి. దాహం తీర్చుకోవాలంటే బయట నుంచి మినరల్ వాటర్‌ను కొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా జల కాలుష్యానికి కారుకులైన హేచరీలను నియంత్రించాల్సి ఉంది.

– వెంకటకృష్ణయ్య, స్థానికుడు

మరో ప్రాంతానికి తరలించాలి



వెంకన్నపాళెం వాసుల జీవనానికి ఇబ్బందులు కలిగిస్తున్న శరత్ ఫీడ్ ప్లాంట్ కార్యకలాపాలను నిలిపివేయాలి. కంపెనీ నుంచి వస్తున్న దుర్వాసనతో ఇంట్లో భోజనం కూడా సరిగ్గా చేయలేకున్నాం. అంతేకాకుండా పలు రకాల వ్యాధులకు గురికావాల్సి వస్తోంది. ఇప్పటికే అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. తమ ప్రాణాలైనా నిలవాలంటే ఈ కంపెనీని మరో ప్రాంతానికి తరలించాలి.

– జంపాల శ్రీహరి, స్థానికుడు

క్లుప్తంగా

గర్భిణులకు వైద్యపరీక్షలు



పొదలకూరు : స్థానిక ఎమ్మార్వో కాలనీలో హైరిస్క్ గర్భిణులకు కో–లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కావ్య శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్షాల నేపథ్యంలో ప్రతిఒక్కరూ కాచిచల్లార్చిన నీటినే తాగాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు ఎం.రాధాకుమారి, సాని శివప్రసాద్, ఆశావర్కర్లు సీత, లక్ష్మి పాల్గొన్నారు.

ఆశీర్వాదం



పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన ఉయ్యాల చినపెంచలరెడ్డి కుమార్తె వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం రాత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా దంపతులను ఆశీర్వదించారు. అనంతరం పార్టీ నాయకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాకాణి వెంట పామూరు లచ్చారెడ్డి, గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, కరిపరెడ్డి కృష్ణారెడ్డి ఉన్నారు.

మునగాకుతో బహుళ ప్రయోజనాలు


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు : మునగాకుతో బహుళ ప్రయోజనాలున్నాయని యల్లాయపాళెం పీహెచ్‌సీ ఏఎస్‌ఎంలు సుకన్య, మహేశ్వరి సూచించారు. మండలంలోని యల్లాయపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు మునగాకు ఉపయోగాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునగాకులో ఐరన్, కాల్షియం, పాస్ఫరస్, విటమిన్ ఏ, విటమిన్ సీలు ఉంటాయని తెలిపారు. ప్రతిఒక్కరూ మునగాకును విధిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ సురేంద్రబాబు, హెచ్‌ఏ ఎం.సురేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు నీరజ, జ్యోత్స్న, కవిత పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి

కోవూరు : లబ్ధిదారులు వేగంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని, అందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శనివారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. మార్చి నాటికి గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుపై పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్

కోవూరు : దీపావళి పండగకు బాణసంచా దుకాణాలను ప్రజలకు అనుకూలమైన ప్రాంతంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం పోలీసులతో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. పలువురి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎస్సై రంగనాథ్‌గౌడ్, ఆర్‌ఐ రాకేశ్, వీఆర్వో శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి అమ్మవారిని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ, వారి సన్నిహితులు శనివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ఈఓ ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారి గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్ల శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రెవెన్యూ సదస్సులు ప్రారంభం

ముత్తుకూరు : మండల పరిధిలో భూముల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ప్రారంభించినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. ఈ నెల 19న వల్లూరువారి కండ్రిగ, 23న మల్లూరు, 25న దొరువులపాళెం, 26న బ్రహ్మదేవి, నవంబరు 2న ఆముదాలపాడు (పిడతాపోలూరు), 5న నారికేళపల్లి, 7న వల్లూరు, 8న తాళ్లపూడి, 12న పొట్టెంపాడు, 13న పిడతాపోలూరు సచివాలయాల్లో సదస్సులు జరుగుతాయన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విడవలూరు : మండలంలోని విడవలూరు, వావిళ్ల గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విడవలూరు గ్రామం ఇందిరమ్మ కాలనీలోని గిరిజన వాసులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సత్కారం

విడవలూరు : మండలంలోని వరిణి పంచాయతీ సెక్రటరీ సుకన్య అల్లూరు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, గ్రామస్తులు ఆమెను శనివారం సత్కరించారు. ఆమె స్థానంలో బాధ్యతలు చేపట్టిన విజయలక్ష్మికి స్వాగతం పలికారు. సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున, ఎంపీటీసీ భక్తవత్సలం పాల్గొన్నారు.

చెన్నపల్లిపాళెం విద్యార్థిని ప్రతిభ

తోటపల్లిగూడూరు : నెల్లూరులో శనివారం జరిగిన జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో మండలంలోని చెన్నపల్లిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని లాలస ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఈఓ రామారావు చేతులమీదుగా విద్యార్థిని లాలసకు రూ.3 వేల నగదుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. స్థానిక పాఠశాల సైన్స్ టీచర్ ఫణికుమార్ పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ


కోవూరు : లక్ష్మికుమారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రసన్న

కోవూరు : మండలంలోని గంగవరం సర్పంచ్ లక్ష్మి కుమారి భర్త, వైఎస్సార్‌సీపీ నేత ఏడెం తిరుపతిరెడ్డి ఇటీవల మరణించారు. దీంతో గంగవరంలోని ఆమె నివాసానికి మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం వెళ్లి పరామర్శించారు. కుటుంబసభ్యులకు ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట పార్టీ నేతలు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, రాధాకృష్ణారెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, సుమిత్రమ్మ, ఉప సర్పంచ్ మోషే, మండల మహిళా అధ్యక్షురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


వెంకటాచలం: రమణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాకాణి

వెంకటాచలం: మండలంలోని పాలిచెర్లపాడు గ్రామానికి చెందిన ఒంటేరు తిరుపాలును మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. తిరుపాలు భార్య రమణమ్మ(55) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈవిషయం తెలుసుకున్న కాకాణి పాలిచెర్లపాడు గ్రామానికి వెళ్లి రమణమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

మనుబోలు : పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని పంచాయతీ విస్తరణాధికారి నారాయణ సూచించారు. మనుబోలు పంచాయతీ కార్యాలయంలో ఆయన శనివారం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిదీపాలు, వీధి కుక్కల సమస్యపై ప్రధానంగా దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం సిబ్బంది హాజరును పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి గరుడయ్య ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ నారాయణ

డిస్లెక్సియా ఫర్ వాక్‌పై అవగాహన

పొదలకూరు : డిస్లెక్సియా(ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు) ఫర్ వాక్‌పై శనివారం స్థానిక డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కె.సనత్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల 2016 చట్టప్రకారం ఇరవై ఒక్క రకాల వైకల్యాల్లో నిర్దిష్ట అభ్యసన వైకల్యం ఒకటిగా పేర్కొన్నారు. పిల్లలకు ప్రత్యేక శిక్షణ ద్వారా వైకల్యాన్ని అధిగమించేందుకు అవకాశం ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్పులు ఉంటుందన్నారు. కార్యక్రమంలో



స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ రమేష్, ఉపాధ్యాయులు ఏవీ సుధాకర్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రసన్నరాజేష్

పొదలకూరు : వీఏఏలు, ఏఈఓలు క్షేత్రస్థాయిలో రైతులకు పంట సాగులో అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని పొదలకూరు వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, ఏజీ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రసన్నరాజేష్ అన్నారు. స్థానిక పరిశోధనా స్థానంలో పొదలకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి మండలాల వీఏఏలు, ఏఈఓలకు ఒకరోజు శిక్షణా శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మినుము, పెసర చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. వేరుశనగలో అధిక దిగుబడులు ఇచ్చే టీసీజీఎస్ 1694, కదిరి లేపాక్షి రకం విత్తనాలు లభ్యమయ్యే చిరునామాలను అందజేశారు. నెల్లూరు డీఆర్సీ ఏడీఏ మారుతీదేవి, ఏఓ మైథిలి, ఏఆర్ఎస్ ఎంటమాలజీ శాస్త్రవేత్త సురేఖాదేవి, జీబీఎస్ఎఫ్ డీపీఎం మాలకొండయ్య తదితరులు విత్తనాల పంపిణీపై మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వెంకురెడ్డి ద్వారా అవగాహన కల్పించారు. ఏడీఏ శివనాయక్, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త హసీనా, ఏఓలు ఎ.వాసు, శశిధర్, ప్రతాప్, జహీర్, సోమసుందర్ పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు : మండల పరిధిలో చేపడుతున్న రీసర్వే గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో రీసర్వే గ్రామసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా అర్జీ రూపంలో అందజేస్తే శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్, సర్వేయర్ రమేష్‌గౌడ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

15 రోజుల్లో పరిష్కారం

కొడవలూరు : రీసర్వేకు సంబంధించి వచ్చిన సమస్యలను 15 రోజుల్లో విధిగా పరిష్కరిస్తామని తహసీల్దార్ కె.స్ఫూర్తి స్పష్టం చేశారు. మండలంలోని నాయుడుపాళెంలో శనివారం గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వేలో ఏమైనా సమస్యలుంటే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వీటి పరిష్కారం కోసం ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి వినతులు స్వీకరించడం ద్వారా తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సర్వేయర్ శ్రీలత, రీసర్వే డీటీ అరుణ్‌కుమార్, వీఆర్వో సురేష్, స్థానిక నాయకుడు మాగుంట సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

రీసర్వేపై గ్రామసభ

మనుబోలు : మండలంలోని గురివిందపూడి పంచాయతీ పరిధిలోని అనుపల్లిపాడు గ్రామంలో శనివారం రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుబ్బయ్య మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్నామని తెలిపారు. చిన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, పెద్ద సమస్యలైతే 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన వెంట రీసర్వే డీటీ మంజుల, ఆర్‌ఐ నారాయణ, వీఆర్వో శ్రీనివాసులు ఉన్నారు.


కొడవలూరు : వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ స్ఫూర్తి


కోవూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ నిర్మలానందబాబా


మనుబోలు : అనుపల్లిపాడులో..

వ్యక్తి అదృశ్యంపై గాలింపు

ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడుకు చెందిన బుడ్డాబత్తిన రమేష్(45) అనే వ్యక్తి నాలుగు రోజుల నుంచి కనబడడం లేదు. ఎస్సై నాగార్జునరెడ్డి కథనం మేరకు.. రమేష్ నాలుగు రోజుల క్రితం బహిర్భూమికి పెన్నా నది వద్దకు వెళ్లాడు. అప్పటి నుంచి కనబడడం లేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ తెలియలేదు. కాగా పెన్నాలో ఓ మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందింది. కాగా నీటి ప్రవాహంలో మృతదేహం కనిపించకుండా పోయింది. దీంతో గజ ఈతగాళ్ల సాయంతో తీవ్రంగా గాలిస్తున్నారు.

మాజీ రైతు సంఘం నాయకుడి మృతి


గునపాటి గోపాల్‌రెడ్డి(ఫైల్)

కోవూరు : రైతుల కోసం ఎన్నో పోరాటాలు చేసిన గునపాటి గోపాల్‌రెడ్డి (93) శనివారం మండలంలోని లేగుంటపాడు గ్రామంలో మృతిచెందారు. ఆయన గతంలో పడుగుపాడు సొసైటీ చైర్మన్‌గా, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా, సీపీఎం పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

వైభవంగా పల్లకిసేవ



పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్ల పల్లకిసేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మనుబోలు మండలం గొట్లపాళెం భక్తులచే కోలాటం ప్రదర్శించారు.

పాత నేరస్తులపై నిఘా పెంచాలి

- ఎస్పీ కృష్ణకాంత్

తోటపల్లిగూడూరు : వివిధ కేసుల్లో ఉన్న పాత నేరస్తులపై నిఘా పెంచాలని ఎస్పీ కృష్ణకాంత్ అధికారులను ఆదేశించారు. తోటపల్లిగూడూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన శనివారం సందర్శించారు. నేరాల నియంత్రణకు కృషి చేయాలని, చోరీ కేసుల్లో ప్రాపర్టీ రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లతో పాటు పాత నేరస్తులపై నిఘా పెంచాలన్నారు. దర్యాప్తులో ఉన్న కేసులను సత్వరమే పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రజలతో మమేకమవ్వాలి

ఇందుకూరుపేట : పోలీసులు గ్రామాలను సందర్శించి ప్రజలతో మమేకమై నేరాలను నియంత్రించాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి నేరాల నియంత్రణకు కృషి చేయాలని, ప్రాపర్టీ రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బైక్ నడిపే పోలీస్ సిబ్బంది, అధికారులు తప్పక హెల్మెట్ ధరించాలని, లైసెన్సులు కలిగి ఉండాలన్నారు.


తోటపల్లిగూడూరు : సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

సకాలంలో పాఠ్యాంశాలను పూర్తిచేయాలి

కొడవలూరు : పదో తరగతి పాఠ్యాంశాలను సకాలంలో పూర్తి చేయాలని డిప్యూటీ డీఈఓ రఘురామయ్య ఆదేశించారు. మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తొలుత హెచ్‌ఎం మోహనరామలింగయ్యతో చర్చించారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు ఎంత మంది 8వ తరగతి విద్యార్థులు నమోదయ్యారు. యూడైస్ ప్లస్ ఎంతవరకు పూర్తయింది. అపార్ యాప్‌లో ఎంత మంది 9, 10 తరగతుల విద్యార్థులు నమోదయ్యారు.. తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. చివరగా పాల్ ల్యాబ్, గ్రంథాలయాలను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య, సీఆర్‌ఎంటీ ఎం.దయాకర్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈఓ

గ్యాస్ గోదాముపై విజిలెన్స్ దాడి

- 566 సిలిండర్ల సీజ్

కొడవలూరు : కొడవలూరులోని మాధవ్ హెచ్‌పీ గ్యాస్ గ్రామీణ్ వితరక్ గోదాముపై పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు శనివారం రాత్రి దాడి చేశారు. రిజిస్టర్‌లోని సిలిండర్ల సంఖ్య, వాస్తవ నిల్వల సంఖ్యను పరిశీలించగా 566 సిలిండర్లు వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. అదేవిధంగా నిర్వాహకులు బ్లాక్‌లో అధిక ధరలకు సిలిండర్లను విక్రయిస్తున్నట్లు నిర్ధారించారు. దీంతో నిర్వాహకులపై 6ఏ కేసు నమోదు చేసి 566 సిలిండర్లను సీజ్ చేసి నెల్లూరు హెచ్‌పీసీఎల్ సేల్స్ ఆఫీసర్‌కు అప్పగించారు. సీజ్ చేసిన సిలిండర్ల విలువ రూ.15,15,461లు ఉంటుందని అధికారులు తెలిపారు. దాడుల్లో పౌరసరఫరాల శాఖ ఏఎస్‌ఓ జె.రవి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరిరావు, విజిలెన్స్ తహసీల్దార్ జీఎస్.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.


సీజ్ చేసిన సిలిండర్లను సేల్స్ ఆఫీసర్‌కు అప్పగిస్తున్న విజిలెన్స్ అధికారులు